ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.15-06-2025 సమయం 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ ఈ నెలాఖరులో విడుదలవుతుందని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.
2. ఎస్సీ, ఎస్టీ మైనార్టీ ప్రజల అభివృద్ధి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బహుముఖ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోందని ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.
3. బనకచర్ల రిజర్వాయర్ ప్రాజెక్టు అంశం పై విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి హారీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
4. రాష్ట్రంలో ఈ రోజు, రేపు ఒక మోస్తారు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

...............................................

**ఏరువాక**

పాలేరు నియోజవర్గం కూసుమంచి మండల కేంద్రంలో జరిగిన ఏరువాక కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. అరక పట్టి ఆయన పొలం దున్నారు. రైతు సోదరులకు, మహిళా కూలీలకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. ఈ

సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఏడాది మంచి వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

DESK

## ఎస్సీ,ఎస్టీ

ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ ప్రజల అభివృద్ధి సంక్షేమానికి పాటుపడుతూ వారి జీవన విధానాల్లో గుణాత్మకమైన మార్పు తీసుకురావడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆయన పర్యటించారు. గురుకులాల్లో నాణ్యమైన భోజనాన్ని అందించడం, అద్దె భవనాల్లో కొనసాగుతున్న మైనారిటీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మింపజేయటం, విద్యార్థుల వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించామని ,అలాగే సాంఘిక సంక్షేమ గురుకులాల్లో బోధనా సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. ఎస్సీ ఉప ప్రణాళిక నిధులను ఆ ప్రాంతంలోనే ఖర్చయ్యేలా తగిన ప్రణాళికల రూపొందిస్తామని, పోటీ పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ ఎస్టీ విద్యార్థుల కోసం ఆయా కార్పొరేషన్ల ద్వారా నిధులు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

DESK

బాసరలో భక్తుల మృతి :

బాసర పుణ్యక్షేత్ర సమీపంలో గోదావరి నదిలో ఐదుగురు యాత్రికుల దుర్మరణంపై నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ విచారం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌కి చెందిన భక్తులు బాసర దేవస్థానానికి విచ్చేసి గోదావరిలో స్నానం చేస్తుండగా ఐదుగురు మృతి చెందడం దురదృష్టకరమని తెలిపారు. గోదావరిలో ఏర్పాటు చేసిన స్నానఘట్టాలలో మినహా, ఇతర ప్రాంతాల్లో భక్తులు స్నానాలు చేయటాన్ని నిషేధించామని పేర్కొన్నారు.

PTC

**స్థానిక సంస్థలు - బిఆర్ఎస్:**

బీసీలకు రిజర్వేషన్ ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలను ఏ విధంగా నిర్వహిస్తారని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై స్పష్టత వచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

డెస్క్

**వాతావరణం:**

రాష్ట్రంలో ఈ రోజు, రేపు ఒక మోస్తారు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ రోజు రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాం గద్వాల్ జిల్లాలలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

-డెస్క్

**స్థానిక సంస్థలు :**

జూన్ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవుతుందని తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో చర్చించిన అనంతరం ఎన్నికల తేదీపై స్పష్టత ఇస్తామని చెప్పారు. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రాంతాల ముఖ్యనేతలతో మంత్రి సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికలకు 15 రోజుల గడువు మాత్రమే ఉందని.. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పొంగులేటి సూచించారు. వారం రోజుల్లో 'రైతు భరోసా',

సన్నరకం ధాన్యానికి బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమచేస్తామన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక నాయకులదేనని మంత్రిచెప్పారు.

డెస్క్

**చిరుధాన్యాలు:**

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ ఐఐఎంఆర్ లో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ ప్రారంభం కానుంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నాలుగు ఎకరాల్లో రూ.250 కోట్లతో ఈ కేంద్రం ఏడాదిలో సిద్ధం కానుంది. చిరుధాన్యాలపై పరిశోధనలు, ఆవిష్కరణలు, సాగులో సుస్థిరాభివృద్ధికి ఈ సంస్థ వేదిక కానుంది. ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్ల ఉత్పత్తి, వినియోగాన్ని ప్రోత్సహించడం, సాగులో వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ఉపయుక్తమయ్యే విధంగా ఐఐఎంఆర్‌లో జీసీవోఈఎం నిర్మాణానికి కేంద్రం సంకల్పించింది. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అధిక దిగుబడినిచ్చే, పోషకాలు సమృద్ధిగా ఉండే వంగడాల అభివృద్ధి.. సాగును సులభతరం చేయడానికి ఆధునిక, సాంకేతిక యంత్రాలను ఈ శ్రేష్ఠత కేంద్రం రూపొందిస్తుంది.

డెస్క్

**జూరాల వరద :**

జూరాల జలాశయంలోకి 15 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. జలాశయంలో నీటి నిలువ సామర్థ్యం 7.40 టీఎంసీల మేర ఉంది. కృష్ణ నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల కర్ణాటకలోని నారాయణపూర్ జలాశయంలోకి 35 వేల క్యూసెక్కుల వరద చేరింది. జలాశయంలో నీటి నిలువ సామర్థ్యం 32 టీఎంసీల కు పెరిగిన క్రమంలో 14,000 క్యుసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో జూరాలకి వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జలాశయం నుంచి జల విద్యుత్ కేంద్రానికి 35 వేల క్యూసెక్కులు

నీటిని విడుదల చేస్తుండగా నెట్టెంపాడు, కోయిల్ సాగర్ పథకాలకు1.850 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

పిటిసి

**భద్రాద్రి కొత్తగూడెం:**

కొత్తగూడెం నియోజకవర్గంలో ఈరోజు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభోత్సవాలు చేశారు. కొత్తగూడెంలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.35 లక్షలతో చేపట్టనున్న మరమత్తు పనులకు శంకుస్థాపన చేశారు. లక్ష్మీదేవి పల్లి, ఇల్లందు క్రాస్ రోడ్, చాతకొండ క్రాస్ రోడ్ లలో నిర్మించిన మినీ బస్ షెల్టర్ లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 84 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని కృతజ్ఞతలు తెలిపారు.

**కూనంనేని సౌండ్ బైట్ ..........**

పిటిసి

**బనకచర్ల :**

బనకచర్ల రిజర్వాయర్ ప్రాజెక్టు అంశం పై అఖిలపక్ష సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు ను కోరారు. ఈ మేరకు మంత్రికి ఆయన లేఖ రాశారు. 2014 ఏపి విభజన చట్టం ప్రకారం కొత్త నీటి పారుదల ప్రాజెక్టులు చేపట్టినపుడు గోదావరి, కృష్ణా బోర్డులతో పాటు అపెక్స్ కౌన్సిల్ అనుమతి కూడా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టాన్ని ఉల్లంఘించిందని హరీష్ రావు ఆరోపించారు. దీనిపై తక్షణమే అపెక్స్

కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని ఆయన లేఖలో ప్రస్తావించారు.

డెస్క్

**రాజన్న సిరిసిల్ల జిల్లా**

వయోవృద్ధుల సంక్షేమం కోసం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు చేపడుతున్నాయని, రాజన్న సిరిసిల్ల జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ... 60 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులను వారి సంతానం, లేదా చట్టబద్ధమైన వారసులు నిర్లక్ష్యం చేసినట్లయితే చట్టపకారం చర్యలు తీసుకోవచ్చు అన్నారు.

**లక్ష్మీ రాజం బైట్ .......**

పిటిసి

**భద్రాద్రి కొత్తగూడెం - ఐటీడీఏ:**

ఆదివాసి గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తి ఆభా జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకాన్ని.. గిరిజన కుటుంబాలు, కొండ రెడ్ల గిరిజనులు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 16 నుండి 30వ తేదీ వరకు ఐటీడీఏ పరిధిలో ఉన్న 19 మండలాల్లో గిరిజన మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ద్వారా ప్రకటించబడిన పిఎం ధర్తీ ఆబా గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం పై గిరిజనులకు అవగాహన కల్పించటానికి ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.. ఈ కార్యక్రమాన్ని ప్రచారం చేయడానికి ప్రాంతీయ గిరిజన భాష లిపి తెలుగులో కోయ, లంబాడా భాషలలో వాల్ పోస్టర్లు ముద్రించి గ్రామాలలో అంటించాలని ఎంపీడీవోలను ఐటీడీఏ పీవో ఆదేశించారు. పిటిసి